7

సాక్షి
సంగారెడ్డి

సోమవారం । 20 । జనవరి । 2025



బోనం సమర్పించేందుకు వస్తున్న భక్తులు



స్వామివారి రాజగోపురం ఎదుట భక్తుల సందడి

జజ్జనకరి జనాలే.. కొమురవెల్లి జాతరే

వైభవంగా మల్లన్న పట్నం వారం ▪ వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

కొమురవెల్లి(సిద్దిపేట): 'మల్లన్న మమ్మేలు.. కోర మీసాల స్వామి దీవించు.. అంటూ భక్త జనం భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. మల్లన్న నామస్మరణతో ఆలయ పరిసరాలన్నీ మారుమోగాయి. శివసత్తుల శిగాలు, పోతరాజుల విన్యాసాలతో సందడి నెలకొంది. మహాజాతర ప్రారంభమైంది. ఆదివారం మల్లన్న పట్నం వారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. హైదరాబాద్ నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు పట్నాలు వేశారు. అనంతరం గంగిరేణి చెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించారు. స్వామి వారి దర్శనానికి సుమారు 6 గంటల సమయం పట్టింది.

బోనాలతో బారులు

స్వామి వారికి ప్రీతికరమైనది బోనం. వేలాదిగా మహిళలు బోనాలతో బారులు తీరారు. స్వామివారికే కాకుండా గుట్టపై వెలిసిన రేణుక ఎల్లమ్మకు నైవేద్యాలు సమర్పించారు.

దారులన్నీ కొమురవెల్లికే..

మల్లన్న స్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్నాటక, తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్రాల నుంచి సైతం జనం రావడంతో దారులన్నీ కిటకిటలాడాయి. ఆలయానికి చేరుకునే రహదారుల్లో 2 కిలోమీటర్ల మేర భక్తులు నిండిపోయారు. పోలీస్ కమిషనర్ అనురాధ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

న్యూస్‌రీల్

గ్రామ సభలకు ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి



కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ఈనెల 21 నుంచి చేపట్టనున్న గ్రామసభలకు అన్ని రకాల ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...గ్రామసభల వద్ద ప్రజలకు మంచి నీరు, కుర్చీలు వంటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సమర్థవంతంగా గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలలో ముందు జాగ్రత్తలు చేపట్టాలన్నారు.

సాగు భూములకే రైతు భరోసా

అదనపు కలెక్టర్ మాధురి



రైతు భరోసా సర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి తదితరులు

కొండాపూర్(సంగారెడ్డి): కేవలం సాగులో ఉన్న భూములకే రైతు భరోసా పథకం వర్తిస్తుందని అదనపు కలెక్టర్ మాధురి స్పష్టం చేశారు. రెవెన్యూ, వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సాగులో లేని భూముల వివరాలను సేకరించాలని అధికారులను ఆమె ఆదేశించారు. మండల పరిధిలోని మల్కాపూర్‌లో రైతు భరోసా సర్వే మ్యాప్‌ను అదనపు కలెక్టర్‌తోపాటు ఆర్డీవో రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వ ఆదేశాల మేరకు రాళ్లు ఉన్న భూములు, ప్లాట్‌లుగా మారిన భూములు, మందిరాలుగా మారిన, స్థిరాస్తి లేఅవుట్‌లుగా మారిన , రహదారులుగా మారినవి, పరిశ్రమలు, గోదాంలకు, మైనింగ్‌లకు వినియోగిస్తున్న వాటి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిత, వ్యవసాయాధికారి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్



మాట్లాడుతున్న కంబాపురం అశోక్

నారాయణఖేడ్: తుక్కుగూడ ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్ చేసింది. ఆదివారం ఖేడ్‌లోని సంఘం ప్రాంతీయ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంబాపురంఅశోక్, సాయిలు మాట్లాడుతూ...తుక్కుగూడ ఘటనకు నిరసనగా జిల్లాలో అన్ని పాఠశాలల్లో భోజన విరామ సమయంలో సోమవారం నిరసన ప్రదర్శనలు చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలు నిరసనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సర్వీస్ పింఛను సాధిస్తాం

టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

సంగారెడ్డి జోన్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగులకు త్వరలోనే సర్వీస్ పింఛను సాధిస్తామని తెలంగాణ సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలోని ఆదివారం నిర్వహించిన టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐక్యంగా ఉద్యమించడం వల్లే సీపీఎస్ ఉద్యోగులకు గ్రాడ్యుటీ, ఫ్యామిలీ పింఛను సాధించామన్నారు. సీపీఎస్ రద్దు , ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు సంఘం బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు.

అక్రమాలకు చెక్!

- ముస్సిపాలిటీల్లో భవనాలకు పక్కాగా కొలతలు
- ఆదాయమార్గాలపై మున్సిపల్ శాఖ కసరత్తు
- ఆస్తిపన్ను పెంపునకు చర్యలు



సదాశివపేట మున్సిపాలిటీ

సదాశివపేట(సంగారెడ్డి): మీ భవనానికి నిర్మాణ అనుమతి ఉందా? ఉంటే ఎన్ని అంతస్తులకు అనుమతి తీసుకుని ఎన్ని అంతస్తులు నిర్మించారు? భవనం మొత్తం విస్తీర్ణం ఎంత? ఎంత విస్తీర్ణానికి పన్ను చెల్లిస్తున్నారు? నివాస కేటగిరీకి అనుమతి తీసుకుని వాణిజ్య వ్యాపార లావాదేవీలకు వినియోగిస్తున్నారా? జీప్లస్ వరకు మాత్రమే అనుమతి తీసుకుని ఇష్టారాజ్యంగా అదనపు అంతస్తులు నిర్మించారా? అయితే మీకు పన్ను పోటు గ్యారంటీ. ఆదాయమార్గాల అన్వేషణలో మున్సిపల్‌శాఖ ఇలాంటి వాటిమీద దృష్టి కేంద్రీకరించింది.

ఖజానాను పరిపుష్టం చేసేలా...

ప్రతీ భవనాన్ని పక్కాగా కొలతలు వేసి అన్ని విషయాలను పరిశీలించి పన్ను విధించనున్నారు. మున్సిపాలిటీల ఖజానాను ఆర్థికంగా పరిపుష్టం చేసే దిశగా కసరత్తు మున్సిపల్ శాఖ ప్రారంభించింది. ఆస్తిపన్ను వసూళ్లలో మరిన్ని సంస్కరణలు తెచ్చి మరింత ఆదాయాన్ని రాబట్టుకునేందుకు మున్సిపల్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేసింది. మున్సిపాలిటీల్లో వేతనాలు చెల్లించాలన్నా అభివృద్ధి పనులు చేయాలన్నా ఇంటి పన్నుల ద్వారా వచ్చే ఆదాయమే కీలకం. ఈ క్రమంలోనే మున్సిపాలిటీ అధికారులు ఆదాయం పెంచే మార్గాలపై దృష్టి పెట్టారు. భవన నిర్మాణాలపై పన్నులు వేసే ప్రయత్నంలో ఉన్నారు. పట్టణ ప్రజలు కేవలం గ్రౌండ్‌ఫ్లోర్ ఇంటి నిర్మాణాలకే అనుమతి తీసుకుని రెండు, మూడు అంతస్తులు నిర్మించడం, వాణిజ్య అవసరాలకు సంబంధించి దుకాణాలు ఏర్పాటు చేసుకుంటూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. అనుమతులున్న వాటిని గుర్తించి ఆస్తి పన్నులు పెంచేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేసింది. మూడేళ్ల క్రితం భువన్ యాప్ ద్వారా గుర్తించారు. ప్రస్తుత సర్వేలో భువన్‌యాప్ తర్వాత చేపట్టిన భవనాలను గుర్తించి కొలతలు తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

ప్రయోజనాలు ఇలా...

యాప్‌లో నమోదైన అంశాలన్నీ మున్సిపల్ కమిషనర్ పరిశీలన తర్వాత ఆయా కొలతలకు తగ్గట్టుగా పన్ను వసూలు చేస్తారు. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మున్సిపాలిటీలకు ఆదాయం పెరగనుంది. కార్మికుల వేతనాలు చెల్లించడంతోపాటు అభివృద్ధి పనులు కూడా జరుగుతాయి.

జనవరి చివరినాటికి పూర్తి!

ముస్సిపాలిటీల్లో మొదటపై అంతస్తులు ఉన్న ఇళ్లను గుర్తిస్తారు. ఆ ఇంటికి మార్కింగ్ వేసి మున్సిపాలిటీల్లో ఉన్న కొలతలు ఆ తర్వాత నిర్మించిన ఇళ్లను గుర్తిస్తారు. పైఅంతస్థులు నిర్మించిన వాటికి కొలతలు వేసి జనవరి చివరి వారం నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేస్తారు. ఈ మూడేళ్లలో నిర్మించిన వాటిని మాత్రమే పరిగణలోకి తీసుకుని ఏమైనా మిగిలిన గృహాలుంటే ఫిబ్రవరి మొదటి వారంలో నమోదు చేస్తారు. ఆ నెల చివరి వారం నాటికి రికార్డుల్లో లేని వాటికి సంబంధించి పన్నులు నమోదు చేస్తారు. ఏప్రిల్‌లో కొత్తగా ప్రారంభమయ్యే 2025–26 ఏడాదికి ఆస్తి పన్ను మదింపు చేసి డిమాండ్ నోటీసులు ఇవ్వనున్నారు. ఇలాంటి భవనాలు జిల్లాలోని 8 మున్సిపాలిటీల్లో 2వేలపై చిలుకు ఉంటాయని ప్రాథమికంగా నిర్ధారించారు.

జిల్లాలోని 8 మున్సిపాలిటీల్లోని భవనాల వివరాలిలా ఉన్నాయి

మున్సిపాలిటీ	భవనాల సంఖ్య
సంగారెడ్డి	23,125
జహీరాబాద్	18,214
సదాశివపేట	14,214
అందోల్ జోగిపేట	6,200
నారాయణఖేడ్	5,300
అమీన్‌పూర్	28,120
తెల్లాపూర్	22,100
బొల్లారం	18,210

ప్రయోగాలకు పరికరాలేవీ?

- ఇంటర్ ప్రాక్టికల్స్‌కు ఇంకా 13 రోజులే
- 50 శాతం ప్రాక్టికల్స్ కూడా పూర్తి కాని వైనం
- విద్యార్థుల్లో ఆందోళన



సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర కళాశాలలో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించాలంటే సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఎంతో కీలకం. అలాంటిది ప్రాక్టికల్ పరీక్షలకు ఇంకా 13 రోజులే సమయం ఉన్నప్పటికీ ప్రభుత్వ కళాశాలలో కనీసం 25% కూడా విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించలేదు. చాలా కళాశాలల్లో సరిపడా ల్యాబ్‌లు, పరికరాలు లేకపోవడంతో పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వమే ప్రయోగాలకు సంబంధించి పరికరాలను సరఫరా చేసేది. ఈసారి మాత్రం పరికరాల కొనుగోలుకు చాలీచాలని నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకుంది.

జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు

జిల్లావ్యాప్తంగా 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో7,514 మంది విద్యార్థులున్నారు. ప్రథమ సంవత్సరంలో 4,118 మంది విద్యార్థులుండగా, ద్వితీయ సంవత్సరంలో 3,396 మంది విద్యార్థులున్నారు. ప్రయోగాలకు చేయించేందుకు సరైన పరికరాలు లేకపోవడంతో ఇప్పటివరకు 50% ప్రాక్టికల్స్ కూడా చేయించలేకపోయారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కళాశాలలకు ప్రయోగ పరికరాలను కొనుగోలు చేసేందుకు ఒక్కో కళాశాలకు రూ.25 వేలు మంజూరు చేసింది. ఈ చాలీచాలని నిధులను నవంబర్ చివరి మాసంలో విడుదల చేయడంతో సైన్స్ అధ్యాపకులు అసహనం వ్యక్తం చేశారు. జంతు, వృక్ష, భౌతిక, రసాయన శాస్త్రాలకు సంబంధించి నాలుగు ల్యాబ్‌లకు రూ.25 వేలు మంజూరు చేస్తే పరికరాలను ఎలా కొనుగోలు చేయాలని వాపోతున్నారు.

ప్రాక్టికల్స్ ముగిసేనా!

ప్రతీ ఏటా ఫిబ్రవరిలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రయోగ పరీక్షలు ఫిబ్రవరి 3వ తేదీన ప్రారంభం అవుతుండటంతో ఇంకా పరీక్షలకు 13 రోజుల సమయం మాత్రమే ఉంది. డిసెంబర్ 1వ తేదీ నుంచి 90 రోజుల ప్రణాళికతో సిలబస్ పూర్తి చేసి రివిజన్ తరగతులు నిర్వహించాలని ఇంటర్మీడియెట్ బోర్డు ఆదేశించిన సంగతి తెలిసిందే.

నిధులు విడుదల చేశాం



ప్రయోగ పరికరాలను కొనుగోలు చేసేందుకు ఒక్కో కళాశాలకు రూ.25 వేలు మంజూరయ్యాయి. నిధులను విడుదల చేసి కూడా రెండు నెలలైంది. అన్ని కళాశాలల్లో పరికరాలను కొనుగోలు చేసి ప్రాక్టికల్స్ ప్రారంభించారు. పరీక్షల సమయానికి ప్రాక్టికల్స్‌ను పూర్తి చేస్తాం.

–గోవిందరాం, ఇంటర్మీడియెట్ అధికారి

'ఆర్చరీను ప్రోత్సహిస్తే పతకాలు తెస్తాం'



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వం ఆర్చరీ క్రీడను ప్రోత్సహిస్తే ఒలింపిక్‌లో పథకాలు సాధించి తీరుతామని రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు టి.రాజు ధీమా వ్యక్తం చేశారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ఒలిపింక్ పథకాలు సాధించేందుకు రూపొందించిన 8 ప్రధాన క్రీడల్లో ఆర్చరీను చేర్చడం హర్షదాయకమన్నారు. ఈ పోటీల్లో 20 జిల్లాల నుంచి 188మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరిలో పశ్చిమబెంగాల్‌లో జరిగే జాతీయస్థాయి ఆర్చరీ క్రీడా పోటీలో పాల్గొంటారన్నారు. రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ మాట్లాడుతూ... గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందు కు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు.

నాణ్యత లోపిస్తే చర్యలే

- మంత్రి దామోదర రాజనర్సింహ
- అందోల్ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న పనుల తనిఖీ
- రూ.100 కోట్లతో సింగూరు టూరిజం పనులు



అందోల్‌లో పనులను పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

జోగిపేట(అందోల్): అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. అందోల్‌లోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మంత్రి దామోదర ఆదివారం తనిఖీ చేశారు. బాలికల పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాల, కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ....పనుల నాణ్యతలో రాజీ పడొద్దని అధికారులకు, కాంట్రాక్టర్‌లకు సూచించారు. వీలైనంత త్వరగా పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. అందోల్‌లోని విద్యాసంస్థలన్నిటికీ లైటింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు.

పర్యాటక కేంద్రంగా సింగూరు...

సింగూరును రూ.100కోట్ల వ్యయంతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి దామోదర పేర్కొన్నారు. సింగూరు ప్రాజెక్టు వద్ద నీటిపారుదల శాఖ స్థలంలో టూరిజం అభివృద్ధితోపాటు ప్రాజెక్టు నీటి మధ్యన పడకంటిగడ్డపై పార్కులు, ముద్దాయిపేట సమీపంలో, పాత సింగూరు పునరావాస స్థలంలో పార్కులు నిర్మిస్తామని తెలిపారు. పుల్‌కల్ నుంచి సింగూరు ప్రాజెక్టుకు వన్‌వే రహదారి నిర్మించి విభాగినులు ఏర్పాటుచేస్తామన్నారు. కస్తూర్బా పాఠశాలలో రూ.1.40కోట్లతో డిజిటలైజేషన్ చేస్తామని ఈ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. మంత్రి వెంట అందోల్ ఆర్డీవో పాండు, ఏఈ మల్లప్ప, పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

క్రికెట్ ముగింపు కార్యక్రమానికి ఆహ్వానం

ఈనెల 26న మాజీమంత్రి దివంగత సిలారపు రాజనర్సింహ మెమోరియల్ క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రి దామోదర రాజనర్సింహను నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ నెల 18వ తేదీ నుంచి మంత్రి తండ్రి రాజనర్సింహ పేర క్రికెట్ పోటీలు స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న విషయం తెలిసిందే.

ఎన్‌హెచ్‌గా గుర్తింపునకు ప్రతిపాదనలు

- ఖేడ్‌లో రెండు ప్రధాన రహదారులు
- మూడు రాష్ట్రాలతో అనుసంధానం
- ఎమ్మెల్యే సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గంలోని రెండు ప్రధాన రహదారులను రెండు రాష్ట్రాలకు అనుసంధానిస్తూ జాతీయ రహదారులుగా గుర్తించేందుకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ద్వారా కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ నుంచి సిద్దిపేట, మెదక్ మీదుగా ఉన్న జాతీయ రహదారిని బొడ్మట్‌పల్లి, అల్లాదుర్గం, మెటల్ కుంటలు మీదుగా జహీరాబాద్ వరకు పొడిగించి జాతీయ రహదారిగా గుర్తించేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈమార్గంలోని ఉసిరికెపల్లి నుంచి ఖేడ్, కంగ్టి, ఔరాద్, లాతూర్‌ల మీదుగా ఉద్గీర్ లోని జాతీయ రహదారివరకు 170 కి. మీలను జాతీయ రహదారిగా గుర్తించి అభివృద్ధి చేయాల్సి ఉందని చెప్పారు. ఖేడ్ మీదుగా 161బీ జాతీయ రహదారి ఉన్నందున ఇక్కడినుంచి కరస్‌గుత్తి, సంత్‌పూర్, సంగం, కమలనగర్ మీదుగా నీలంగా వరకు ఉన్న రహదారిని జాతీయ రహదారిగా గుర్తించి అక్కడి ఎన్‌హెచ్‌కు అనుసంధానించాలన్నారు. ఆయా రహదారులు తెలంగాణ నుంచి కర్ణాటక, మహారాష్ట్రల మీదుగా ఉండటంతో ఆయారాష్ట్రాలకు అనుసంధానమవుతాయన్నా రు. ఈమేరకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన వెల్లడించారు. ఖేడ్ పట్టణంలోని ప్రధాన రోడ్లను ఇరుపక్కలా 40 అడుగుల వెడల్పుతో విస్తరించనుండగా రోడ్డు బాగాపాడైనందున వారం రోజుల్లోగా మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

వారికీ రైతు భరోసా...

అసైన్డ్ భూముల్లో చాలాచోట్ల రాళ్లురప్పలు ఉండి అందులో కొంతమేర సాగులో లేకున్నా పేదలైనందున వారికి రైతుభరోసా అందించాలని, అంతగా పంటలు పండని పెద్దపట్టేదారులకు కూడా రైతు భరోసా అందించేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. అంతకుముందు ఇటీవల పీహెచ్‌డీ పట్టా పొందిన మనూరు మండలం శెల్గిరాకు చెందిన ఎం. విఠల్‌ను ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఘనంగా సన్మానించారు.

స్పందన సరే.. అవగాహనేది?

- పోలీసు పనితీరుపై క్యూఆర్ కోడ్‌తో స్పందన
- దీనిపై సమాచారం లేదంటున్న ఫిర్యాదుదారులు



ఫిర్యాదుదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు



ఫీడ్ బ్యాక్ ఇస్తున్న ఫిర్యాదుదారు

పటాన్‌చెరుటౌన్: పోలీసుల పనితీరు పట్ల ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు ఇటీవల పోలీసు శాఖ క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెట్టింది. వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసిన తర్వాత వారికి అందుతున్న సేవలపై క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి అందులో వచ్చే ఫారంపై వివరాలు ఇవ్వాలి. అయితే స్కాన్ చేసిన వెంటనే ఫోన్ లోకి తెలుగు, ఆంగ్ల భాషల్లో ఉండే ఒక ఫారం వస్తోంది. వివరాలను అందులో పూరించి పంపించాల్సి ఉంటుంది. ఫోన్‌లో టైప్ చేయడం సాధ్యం కాని వారు వాయిస్ రూపంలో కూడా తమ అభిప్రాయాలను తెలిపే వీలు కల్పించారు. ఇలాంటి వారికి ఆటోమేటిక్ కాలింగ్ యాప్ ద్వారా ఫోన్ చేసి అభిప్రాయాలను సేకరిస్తారు. ఇది నేరుగా హైదరాబాద్ డీజీ కార్యాలయానికి చేరుతుంది. ప్రస్తుతం పిటిషన్, ఎఫ్ఐఆర్, ఈ–చలానా, పాస్‌పోర్ట్ పరిశీల విభాగాల్లో అభిప్రాయాలను సేకరించనున్నారు. ప్రజల అభిప్రాయాల ఆధారంగా పోలీస్ స్టేషన్లకు ర్యాంకులను ఇస్తారు. అయితే ఈ విధానానికి ఇంకా సరైన స్పందన లభించడంలేదు. స్టేషన్ వచ్చి ఫిర్యాదుదారులకు ఆ విధానంపై అవగాహన లేకపోవడమేనని ఇందుకు కారణంగా తెలుస్తోంది. మూడు రోజుల క్రితం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఫిర్యాదుదారులకు కనిపించే విధంగా ఫీడ్ బ్యాక్ క్యూ ఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. స్టేషన్ వచ్చిన ఫిర్యాదుదారులు కొంతమంది ఫీడ్‌బ్యాక్ ఇచ్చేందుకు ఆసక్తి చూపగా ఎక్కువమంది అంతగా ఆసక్తి చూపించలేదు. ఇందుకు ఈ క్యూఆర్‌కోడ్ విధానంపై సరైన అవగాహన లేకపోవడమేనని వారు చెబుతున్నారు.

అవగాహన కల్పించాలి..

ఫీడ్ బ్యాక్ క్యూ ఆర్ కోడ్‌పై స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు అవగాహన కల్పించాలి. దీని గురించి నాకు ఈ రోజే తెలిసింది. ఫీడ్ బ్యాక్ విధానం ద్వారా పోలీసులు ఇంకా బాగా పనిచేస్తారని భావిస్తున్నా. గొడవ జరిగిందని పోలీస్‌స్టేషన్ కు వచ్చాను. అధికారులు స్పందించి కేసు నమోదు చేశారు. దీనిపై ఫీడ్ బ్యాక్ పనితీరు బాగుందని ఇచ్చాను.

-రమేశ్, పటాన్‌చెరు

బాధితులకు అండగా...

రెండు రోజుల క్రితం ఫోన్ పోయింది. దీంతో పోలీస్‌స్టేషన్‌కు వస్తే, మీ సేవలో ఫోన్ లాస్ట్ అని అప్లై చేసుకుని రశీదు తీసుకు రమ్మన్నారు. మీసేవ రశీదు తీసుకుని వచ్చాక సీఈఐఆర్ పోర్టల్‌లో ఎలా నమోదు చేయాలో వివరించారు. ఫీడ్ బ్యాక్ క్యూ ఆర్ కోడ్ పోలీస్ శాఖ ప్రవేశపెట్టిందనే విషయం తెలియదు. ఈ విధానం బాధితులకు అండగా నిలుస్తుందని అనుకుంటున్నా.

– సాయికుమార్ , వెంకటేశ్వర కాలనీ

క్లుప్తంగా

డీసీసీబీ డైరెక్టర్ రామచంద్రం మృతి

ఎమ్మెల్యే హరీశ్‌రావు సంతాపం



రామచంద్రం మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): డీసీసీబీ ఉమ్మడి మెదక్ జిల్లా డైరెక్టర్ నమూండ్ల రామచంద్రం అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకొని మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఎమ్మెల్యే హరీశ్‌రావు సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబీకులను ఓదార్చారు. రామచంద్రం బీఆర్ఎస్ కు అందించిన సేవలను కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో, ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతిబాధాకరమని, పార్టీకి తీరని లోటన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మాణిక్యరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు సంతాపం తెలిపారు. చిన్నకోడూరు మండలం మైలారం గ్రామస్తుడు రామచంద్రం.

అబాకస్‌లో విద్యార్థుల సత్తా



విద్యార్థినితో ఉపాధ్యాయులు

పాపన్నపేట(మెదక్): ఉమ్మడి జిల్లా స్థాయి అబాకస్ పరీక్షల్లో పాపన్నపేట శ్రీవిద్యా స్కూల్ విద్యార్థినులు మూడు స్థాయిల్లో మొదటి ర్యాంక్ సాధించి సత్తా చాటారు. సంగారెడ్డి జిల్లా కందిలోని విశ్వం ఎడ్యూ టెక్ ఆధ్వర్యంలో కొత్వాల్ హైస్కూల్‌లో ఆదివారం ఈ పరీక్ష నిర్వహించారు. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి 32 పాఠశాలలకు చెందిన 440 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్టార్ జూనియర్ స్థాయి పరీక్షల్లో పాపన్నపేట శ్రీవిద్య పాఠశాలకు చెందిన శ్రీజ, జూనియర్ స్థాయిలో షిజా తనాయి, సీనియర్ స్థాయి పోటీల్లో ఆప్లా మొదటి ర్యాంకు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రవి తెలిపారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ నిశలాక్షప్ప, సుమన్, ప్రియాంక, అనురాధ, దుర్గ, స్రవంతి, ఇందిర, శ్వేత తదితరులు అభినందించారు.

వ్యక్తి అదృశ్యం

నర్సాపూర్ రూరల్: ఒక వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా ఆదివారం నర్సాపూర్‌లో వెలుగులోకి వచ్చింది. ఎస్సై లింగం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చింతల్ చెరువు గ్రామానికి చెందిన టెంట్ హౌస్ కూలీ బలరాం కృష్ణారెడ్డి. యజమాని దుర్గేశ్ ఆదేశాల మేరకు ఈనెల 16న నర్సాపూర్ నల్లపోచమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా టెంటు ఏర్పాటు పనులు నిర్వహించాడు. మరుసటి రోజు (17న) మధ్యాహ్నం వరకు ఇక్కడే ఉండి ఆతర్వాత కనిపించకుండాపోయాడు. అదే రోజు సాయంత్రం కుటుంబ సభ్యులకు యజమాని విషయం తెలిపాడు. నర్సాపూర్‌తో పాటు చింతల్ చెరువు తదితర ప్రాంతాల్లో వెతికినా అతడి ఆచూకీ తెలియరాలేదు. దీంతో బలరాం కృష్ణారెడ్డి సోదరుడు శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని శవం లభ్యం

మనోహరాబాద్(తూప్రాన్): గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదివారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామికవాడ శివారులో ఓ నీటి గుంతలో కుళ్లిపోయిన స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ విషయమై ఎస్ఐ సుభాశ్‌గౌడ్‌ను వివరణ కోరగా గుర్తు తెలియని లభించిందన్నారు. ఇది హత్యా, ఆత్మహత్యా, ప్రమాదమా అనే కోణాల్లో విచారిస్తున్నట్లు తెలిపారు.

సీసీఐలో సిత్రాలు

- బోగస్ రైతుల పేరిట పత్తి విక్రయాలు
- నాసిరకానికి ఏ–గ్రేడ్ ధర పొందుతున్న వ్యాపారులు
- మ్యానువల్ ధ్రువీకరణతో నయా దందా

సీసీఐలో సిత్రాలు మామూలుగా లేవు. వ్యాపారులే బోగస్ రైతుల అవతారమెత్తి పత్తిని విక్రయిస్తున్నారు. రైతులకు క్వింటాలుకు రూ.వెయ్యి తక్కువ ఇచ్చి వారు మాత్రం దర్జాగా ఏ–గ్రేడ్ ధర పొందుతున్నారు. పంట ఆన్ లైన్‌లో నమోదు చేసుకొని రైతులకు మ్యానువల్ ద్వారా ధ్రువీకరణ పత్రాలు ఇస్తుండడం కూడా కొత్త దందాకు దారితీస్తోంది. పక్షం రోజుల కిందట ఒక పత్తి మిల్లులోని సీసీఐలో రైతుకు తెలియకుండానే అతని పేరిట పత్తిని ఒక వ్యాపారి విక్రయించాడు. సదరు వ్యక్తి విషయం తెలుసుకొని గొడవకు దిగాడు. బుజ్జగించి దందా విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. ఈ తంతు అంతా మార్కెట్, సీసీఐ అధికారులకు తెలిసే జరుగుతుందని ఒక వ్యాపారి చెప్పడం గమనార్హం.



ధ్రువీకరణ పత్రాల కోసం వేచి ఉన్న ఇతర జిల్లాల పత్తి వాహనాలు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన నాలుగు సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు 1,57,802 క్వింటాళ్ల కొన్నట్లు మార్కెటింగ్ అధికారులు వెల్లడించారు. హుస్నాబాద్ డివిజన్‌లోని కోహెడ, హుస్నాబాద్, అక్కన్నపేట, మద్దూరు మండలాల్లో 24,874 ఎకరాల్లో పత్తి సాగైంది. తేమ సాకులను తట్టుకోలేని రైతులు ప్రైవేటు వ్యాపారులకు రూ. 6,500లకు క్వింటాలు చొప్పున అమ్ముకుంటున్నారు. బోగస్ రైతుల పేరున సీసీఐలో క్వింటాలు రూ.7,500లకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. వ్యవసాయ అధికారులు ఆన్‌లైన్‌లో పంట నమోదు చేసుకోని రైతులకు మ్యానువల్ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంతోనే పత్తి దందా సాగుతోంది. మెదక్, సంగారెడ్డి, జనగామ, కరీంనగర్ జిల్లాల నుంచి బోగస్ రైతుల పేరున వ్యాపారులు సీసీఐల్లో విక్రయిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. హుస్నాబాద్ డివిజన్‌లోనే ధ్రువీకరణ పత్రాలు తయారు చేస్తున్నారు. ఇదంతా సీసీఐ, మార్కెట్ అధికారులకు తెలిసే జరుగుతుందని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.



వ్యాపారులు తెచ్చిన కాయ పత్తి

తనిఖీలకు వస్తే ఇలా

వ్యాపారులు కాయపత్తి తీసుకొచ్చినా ఏ గ్రేడు ధర చెల్లిస్తున్నారు. సీసీఐ కేంద్రాల ఇన్ చార్జీలకు, మార్కెట్ అధికారులకు వ్యాపారులు కమీషన్లు ఇస్తుండటంతోనే దందా నడుస్తోందని తెలుస్తోంది. జిల్లా మార్కెటింగ్ అధికారులు పత్తి మిల్లులు తనిఖీ కోసం వస్తే వ్యాపారులు ఒక మిల్లులోనే కలుసుకొని రికార్డులను చూపించి అటు నుంచి అటే పంపిస్తున్నారు. హుస్నాబాద్ సీసీఐ కొనుగోళ్ల పై విజిలెన్స్ తనిఖీలు చేపడితే బోగస్ రైతుల వివరాలు వెలుగు చూస్తాయని, పత్తి దందాకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

బోగస్ అని ఎట్లా తెలుస్తుంది?

మార్కెటింగ్ అధికారుల ఆదేశాల మేరకే పత్తి వాహనాలకు అనుమతిస్తున్నాం. పంటలో తేమ శాతం తక్కువ ఉండి, తెల్లగా ఉంటే ఏ గ్రేడు ధర రూ.7,500లు చెల్లిస్తున్నాం. ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు ఉంటే పత్తి కొనుగోలు చేస్తున్నాం. బోగస్ రైతులు అని మాకు ఎట్లా తెలుస్తుంది. ఆన్‌లైన్‌లో పేరు ఉన్నప్పుడు తీసుకోక తప్పదు, అతను వ్యాపారి అని మాకు తెలియదు కదా.

– పంకాజ్, సీసీఐ సెంటర్ ఇన్ చార్జి

చర్యలు తీసుకుంటాం

పత్తి రైతులు పంటను ఎక్కడైనా అమ్ముకొనే వెసులుబాటును ప్రభుత్వం కల్పించగా ఇతర జిల్లా రైతులు హుస్నాబాద్‌లో విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు ఉంటనే సీసీఐ కేంద్రంలో పత్తి కొంటారు. పత్తి పంట సాగు చేయలేదని మనం చెప్పలేం కదా? పంటల వివరాలు సేకరించేటప్పుడే బోగస్ రైతుల పేర్లు నమోదు అవుతున్నాయి. ఈ విషయం మా దృష్టికొస్తే చర్యలు తీసుకుంటాం. పత్తి మిల్లులో కొనుగోలు వివరాల రికార్డులు తనిఖీ చేస్తున్నాం.

– నాగరాజు, డీఎంఓ, సిద్దిపేట

మద్యం తాగవద్దన్నందుకు ఆత్మహత్య

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

కొండపాక(గజ్వేల్): మద్యం తాగొద్దన్నందుకు మనస్తాపానికి గురై వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కొండపాక మండలంలో శనివారం జరిగింది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. దమ్మక్కపల్లికి చెందిన మల్లేశం కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. కొన్నేళ్లుగా మద్యానికి బానిసై కుటుంబ పోషణను పట్టించుకోవడం లేదు. దీంతో భార్య రేణుక మద్యం తాగొద్దని పలుమార్లు మందలించి ఆమె కూలీ పనులకు వెళ్లింది. మనస్తాపానికి గురై భర్త ఇంట్లో దూలానికి ఉరివేసుకొని మృతిచెందాడు. రేణుక తిరిగి అదేరోజు రాత్రి ఇంటికి చేరుకునే సరికే మల్లేశం విగతజీవిగా కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. వారు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు.

జీవితంపై విరక్తి చెంది..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జీవితంపై విరక్తి చెంది పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రామచంద్రాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ కథనం ప్రకారం.. సంగారెడ్డిలో ఉన్న పోతిరెడ్డిపల్లికి చెందిన ఆకుల ప్రశాంత్(27) డిగ్రీ పూర్తి చేశాడు. ఉన్నత చదువుల కోసం కొంతకాలంగా అమెరికా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాడు. శనివారం కుటుంబ సభ్యులతో కలిసి తన పుట్టినరోజు వేడుకలను జరుపుకొన్నాడు. ఆదివారం ఉదయం వాకింగ్ వెళ్తున్నానని ఇంట్లో చెప్పి స్కూటీపై బయటకు వచ్చాడు. ఇక్రిశాట్ ఫెన్సింగ్ సమీపాన ఉన్న రైల్వేట్రాక్ వద్దకు చేరుకుని ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. మంటలు రావడాన్ని గమనించిన ఇక్రిశాట్ సెక్యూరిటీ గార్డు వెంటనే ఈ విషయాన్ని తన ఇన్‌చార్జికి సమాచారం ఇచ్చాడు. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. కాగా ప్రశాంత్ తన అన్న సాయిచందుకు సారీ, ఎవరి తప్పు లేదని వాట్సాప్ మెసేజ్ చేసి లొకేషన్ షేర్ చేశాడని పోలీసులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, అమెరికా వెళ్లేందుకు వీసా పొందే క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని అనుమానిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.



ప్రశాంత్(ఫైల్)

సిలిండర్ పేలి మహిళ సజీవదహనం

సంగారెడ్డి జిల్లా నాగధర్‌లో ఘటన

కల్హేర్(నారాయణఖేడ్): గ్యాస్ లీకై సిలిండర్ పేలగా దివ్యాంగ మహిళ సజీవదహనమైంది. ఈ సంఘటన నిజాంపేట్ మండలం నాగధర్‌లో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కంది ప్రేమల పుట్టుకతోనే దివ్యంగురాలు. ఆమె రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తుంది. ఇంట్లో వంట పూర్తి కాగా భోజనం చేసింది. కరెంట్ సదుపాయం లేక పోవడంతో రాత్రిళ్లు దీపం వెలిగించి నిద్రిస్తోంది. కానీ అదేరోజు రాత్రి గ్యాస్ సిలిండర్ ఆఫ్ చేయడం మరిచిపోయింది. దీంతో లీకై దీపం వల్ల మంటలు అంటుకున్నాయి. మంటల వ్యాపించడం, రేకులు వేడిగా మారడంతో సిలిండర్ పేలింది. మంటలు మరింత విస్తరించాయి. పెద్దశబ్దం రావడంతో చుట్టు పక్కల వారు వచ్చి లోపలికి వెళ్లేందుకు యత్నించి విఫలమయ్యారు. అందరూ చూస్తుండగానే ప్రేమల సజీవదహనమైంది. మృతురాలి కూతురు భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కల్హేర్ ఎస్ఐ వెంకటేశం తెలిపారు. మృతదేహన్ని నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు.



కంది ప్రేమల(ఫైల్)



పేలుడు దాటికి ధ్వంసమైన రేకుల షెడ్డు

చేగుంటకు వెళ్తుండగా అనంతలోకాలకు

బైక్‌ను ఢీకొన్న కారు

ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): కారు బైక్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన నార్సింగి మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ అహ్మద్ మోహినొద్దీన్ కథనం మేరకు... నిజాంపేట మండలం బచ్చురాజ్‌పల్లికి చెందిన చిమ్మనమైన సురేశ్ (27) చేగుంటలో పని నిమిత్తం ఇంటి నుంచి బయటికి వచ్చాడు. మార్గమధ్యలో స్నేహితుడు జప్తిశివనూర్‌కు చెందిన మైలారం ప్రసాద్‌ను బైక్‌పై ఎక్కించుకుని గమ్యస్థానానికి బయలుదేరారు. నార్సింగి జాతీయ రహదారిపై వెళ్తుండగా వడ్డేర కాలనీ సమీపంలో వేగంగా వచ్చిన కారు వెనక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఎగిరి కింద పడి తలకు తీవ్రగాయమై సురేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం సురేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

● సుందరీకరణ ఇదేనా?



డివైడర్ మధ్యలో ఎండిన మొక్కలు

సుందరీకరణ అంటే ఇదేనాని పలువురు ప్రశ్నిస్తున్నారు. డివైడర్ల మధ్యలో నాటిన వివిధ రకాల మొక్కలు ఎండిపోతున్నాయి. వాటిని సంరక్షించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో సుందరీకరణ లక్ష్యం నీరుగారుతోంది. మిరుదొడ్డి మండలకేంద్రంలో రూ.3 కోట్లతో డివైడర్లు నిర్మించారు.

– మిరుదొడ్డి(దుబ్బాక)

ఎల్లమ్మ తల్లి ఆలయంలో చోరీ

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలం సిర్సనగండ్ల గ్రామంలోని ఎల్లమ్మ తల్లి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. హుండీలోని నగదు, వెండి, బంగారపు వస్తువులు ఎత్తుకెళ్లారు. గ్రామానికి సుమారు 2 కిలో మీటర్ల దూరంలో వ్యవసాయ బావులకు వెళ్లే దారిలో దేవాలయం ఉంది. ఆదివారం వ్యవసాయ బావులకు వెళ్లేవారు దేవాలయ తలుపులు తెరచి ఉండటాన్ని చూసి బాధ్యులకు సమాచారం అందించారు. వెంటనే దేవాలయానికి చేరుకున్న గౌడ సంఘం కమిటీ సభ్యులు హుండీ తాళం పగులగొట్టి ఉండటం, భక్తులు సమర్పించిన నగదు డబ్బులతో పాటు వెండి బంగారు ఆభరణాలు దొంగిలించబడ్డాయని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేశారన్నారు. ఈ విషయమై త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హక్కుల కోసం ఉద్యమిస్తాం



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడవెంకటరెడ్డి, నేతలు, కార్యకర్తలు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాబోయే రోజుల్లో మరిన్ని హక్కుల కోసం, మరిన్ని ఉద్యమాలు చేయడానికి అందరూ సిద్ధంగా ఉండాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. దేశంలో అనేక ఉద్యమాలను నిర్మించి, అనేక హక్కులను సాధించుకున్నామన్నారు. పార్టీ 100 ఏళ్ల ఉత్సవ సభ ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలో నిర్వహించిన సభలో చాడ మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పార్టీ అన్నారు. పేద వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్న పార్టీ ఒక్క సీపీఐయే అని అన్నారు. కూడు, గూడు, భూమి కోసం అనేక పోరాటాలు చేసి పేదల పక్షాన నిలిచిన ఘనత తమ పార్టీదేనని అన్నారు. వందేళ్ల శతజయంతి సభలు జరుపుకొంటున్నాం కానీ అధికారంలోకి ఎందుకు రాలేకపోతున్నామో మనం ఒకసారి ఆలోచన చేయాల్సిన అసవరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. కార్మికుల, రైతుల హక్కులు హరించేవిధంగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం నూతన చట్టాలను తెచ్చిందని, వాటిని ఏఐటీయూసీ ప్రజా సంఘాలతో కలిసి పోరాటాలు చేస్తేనే కేంద్రం వెనక్కి తీసుకుందని గుర్తుచేశారు. అనంతరం సీపీఐ పాతతరం నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మందపవన్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎడ్లవెంకట రామిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గడిపే మల్లేశ్, బట్టు దయానంద రెడ్డి, అందే అశోక్, ఎడల వనేశ్, పోతిరెడ్డి వెంకటరెడ్డి, లక్ష్మణ్, జాగిరి సత్యనారాయణ గౌడ్, కనుకుంట్ల శంకర్, స్వాతంత్ర్య సమరయోధుడు గంబీరపు రామయ్య, పట్టణ కార్యదర్శి బన్సీలాల్, జెరిపోతుల జనార్దన్, సంగెం మధు తదితరులు పాల్గొన్నారు.

కాటేసిన కరెంట్

విద్యుదాఘాతంతో రైతు మృతి

చిన్నశంకరంపేట(మెదక్): విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతిచెందాడు. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలం శాలిపేటలో ఆదివారం చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు... గ్రామానికి చెందిన నర్ర రమేశ్ (47) పంటకు నీరు పెట్టేందుకు పొలం వద్దకు వెళ్లాడు. రోజూ మాదిరిగా బోరు మోటారు స్టార్ట్ చేసి తిరిగి వచ్చే రమేశ్ ఎంతకీ రాకపోవడంతో కుమారుడు మధు సెల్‌ఫోన్‌కు కాల్ చేశాడు. తండ్రి నుంచి ఎలాంటి స్పందించకపోవడంతో పొలం వద్దకు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో స్టాటర్ బాక్స్ వద్ద రమేశ్ పడి ఉన్నాడు. వెంటనే కుమారుడు కుటుంబసభ్యులకు ఫోన్ చేసి విషయం తెలిపాడు. ఇక్కడికి చేరుకున్న వారు వెంటనే అతడిని నార్సింగిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ పరిశీలించి అప్పటికి మృతిచెందినట్లు తెలిపారు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.



రమేశ్

విస్తారంగా మొక్కజొన్న సాగు

- సమగ్ర సస్యరక్షణతోనే పంట దిగుబడులు
- కత్తెర పురుగు, తెగుళ్ల నివారణే ముఖ్యం
- డీడీఎస్–కేవీకే శాస్త్రవేత్త స్నేహలత



ఎస్.స్నేహలత, శాస్త్రవేత్త

జహీరాబాద్: జిల్లాలో మొక్కజొన్న పంట విస్తారంగా సాగవుతోంది. ఆలుగడ్డ, పత్తి పంటల ఉత్పత్తులు పూర్తయ్యితే ఎక్కువ విస్తీర్ణంలో జనవరి నెలాఖరు వరకు మొక్కజొన్న సాగు చేపట్టనున్నారు. ఇప్పటికే సాగు చేసిన పైరులో కత్తెర పురుగు, తెగుళ్ల ఆశించడం వల్ల పంట దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. దీని నుంచి బయట పడేందుకు సస్యరక్షణ చర్యలను చేపట్టాల్సి ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో అధికంగా పంట సాగువుతుంది. ఈ పంటకు ప్రధానంగా కత్తెర పురుగుతో పాటు ఎండు, కాండం కుళ్లు తెగుళ్ల అధికంగా వ్యాప్తి చెందుతోంది. దీంతో 40 నుంచి 80 శాతం మేర పంట నష్టం జరిగే ప్రమాదం ఉంది. రైతులు అప్రమత్తమై పంటను కాపాడుకోవాలని డీడీఎస్–కేవీకే శాస్త్రవేత్త ఎస్.స్నేహలత సూచిస్తున్నారు.

కత్తెర పురుగు జీవిత చక్రం

తెల్ల రెక్కల పురుగు ఆకుల అడుగు భాగాన 200 నుంచి 400 గుడ్లు పెడుతుంది. వాటిపై తెల్లగా బూజులాగా కప్పి ఉంటాయి. పొదిగిన పిల్ల పురుగు లేత ఆకుల పత్ర హరితాన్ని గోకి తినడం వల్ల తెల్ల చారలు కనబడతాయి. ఈ లద్దె దశ మొవ్వులోకి ప్రవేశించి తింటూ ఉంటుంది. లద్దె దశ 25 రోజుల్లో పూర్తి అవుతుంది. తర్వాత మొవ్వ నుంచి బయటకు వచ్చి కోశస్థ దశకు మారుతుంది. 7,8 రోజుల్లో కోశస్థ దశ పూర్తి చేసుకుని రెక్కల పురుగుగా మారుతుంది. ఇలా దీని జీవిత చక్రం 30–45 రోజుల్లో పూర్తి అవుతుంది.

నష్ట పరిచే విధానం...

లద్దె దశ ఆకుల పైన పురుగు విసర్జించిన కనబడడం. మొవ్వు లోపల తింటుంది కనుక ఎండిపోవడం, పీకితే వెంటనే రావడం. మొక్కజొన్న కంకి ఏర్పడే దశలో విత్తనం తినడం గమనించవచ్చు.



మొక్కజొన్నకు సోకిన తెగులు



కంకిలోకి ప్రవేశించి నష్టపరుస్తున్న పురుగు

ఎండు /కాండం కుళ్లు తెగులు

- ఈ తెగుళ్లు ఉత్తర, మధ్య తెలంగాణలో ఎక్కువగా వస్తుంది. దీని ద్వారా రైతు 40 నుంచి 60 శాతం పంట నష్టపోతుంటారు.
- భూమిలో ఉండే శిలీంద్రాలైన ఫ్యూసెరియమ్, మాక్రోసోమినాల ద్వారా వేర్లకు కాండానికి వ్యాపిస్తుంది.
- వేరు వ్యవస్థపై బెరడు ఉండి పోవడం, కనుపులపై నల్లటి మచ్చ చూడడం జరుగుతుంది. వేర్లు కుళ్లి పోవడం గమనిస్తాం. ఆకులు కింది నుంచి ఎండిపోవడం, మొక్కలు పూర్తిగా ఎండిపోవడం జరుగుతుంది.

నివారణ:

- పంట మార్పిడ్లు చేసుకోవాలి
- రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు ఎండు, కాండం కుళ్లు తెగుళ్లను తట్టుకునే రకాలను విడుదల చేశారు. అవి డీహెచ్ ఎం–206, డీహెచ్ఎం–182రకాలను సాగు చేసుకున్నట్లయితే తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకోవచ్చు.
- విత్తన శుద్ధి మన్‌కోజెబ్ 3 గ్రాములు కిలో విత్తనానికి లేదా కార్బండిజమ్ ఒక గ్రాము కిలో విత్తనానికి కలిపి విత్తుకోవాలి.
- తెగుళ్లు ఆశించిన మొక్కలను తీసివేయడం, కార్బండెజమ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కలు తీసివేసిన ప్రాంతాన్ని, మొక్కల మొదళ్లలో తడపాలి.
- 2 కిలోల ట్రై కోడర్మా+100 కిలోల ఎరువుతో కలిపి వారం రోజుల పాటు ఉంచి సాళ్ల మధ్యలో వేసుకోవాలి.

యాజమాన్య పద్ధతులు

- దుక్కులు దున్నుకోవాలి.
- పంట చుట్టూ కలుపు నివారించుకోవాలి.
- విత్తన శుద్ధి సయాంట్రనిలిప్రోల్‌తోపాటు థయోమిలిక్సామ్ 6 మి.లీ కిలో విత్తనానికి కలిపి విత్తుకున్నట్లయితే 15–20 రోజుల వరకు పురుగు నుంచి కాపాడుకోవచ్చు. కందిని అంతర పంటగా వేసుకోవాలి.
- 10–15 వై ఆకారంలో కట్టెలను అక్కడక్కడ అమర్చుకోవాలి. వాటిపైన పక్షులు వాలి ఈ పురుగు యొక్క లద్దె దశను తింటుంది.
- 30 రోజుల పంట దశలో లింగాకర్షక బుట్టలు అక్కడక్కడ అమర్చుకోవాలి. పురుగు ఉధృతిని గమనిస్తూ 4–8 రెక్కల పురుగులు గమనిస్తే పిచికారీ చర్య చేపట్టాలి.
- వేపనూనె 1500 పీపీఎం 5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- బీ.టీ(బ్రసిల్లస్ తురింజనసిస్) రెండు గ్రాములు లీటరు నీటికి లేదా మెటరైజియం 5గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- రసాయనాల పిచికారీ విషయానికొస్తే పంట 15 రోజులు ఉన్నప్పుడు క్లోరంట్రానిలిప్రోల్ 0.3 మి.లీలీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- 35 రోజుల పంటకు 3–4 కిలోల కార్బోఫ్యూరాన్ గ్రాన్యూల్స్ ఎకరానికి మొక్కలో పడే విధంగా వేసుకోవాలి. 55 రోజులకు 0.5 గ్రాముల ఇనుమెక్టిన్‌బెన్‌జోయెట్ లేదా 0.5 మి.లీ స్పై ప్రనెటోరామ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- విషపు ఎరలు కూడా వేసుకోవచ్చు. 10 కిలోల తౌడు+ఒక కిలో బెల్లం వేసి బాగా కలిపి ఒక రాత్రి ఉంచి 500 మి.లీ మోనోక్రోటోఫాస్ మందును కలిపి చిన్న ఉండలాగా చేసి సాయంత్రం పంట మొవ్వులో గాని మొక్కలకు దగ్గరలో మట్టిలో వేసుకోవాలి.